శ్రీ జానకీ రామ శతకము

13331



శుభమస్తు.

అవిఘ్నమస్తు.

# శ్రీజానకీరామశతకము.

శ్రీదివాకరకులసింధుకైరవమిత్ర సురలోకవినుత భాసుర
చరిత్ర। శరణాగతాఖిలజనమహావనచైత్ర విపులపాపాటవీవీతి
హోత్ర। వనజసంభవముఖమునివరస్తుతిపాత్ర లోకైకమిత్ర సీ
తాకళత్ర। నీలనీరదగాత్ర నీరజదళనేత్ర ధవలతాసముదయపటు
లవిత్ర॥ నీనశతకంబొకటి కృతి జేసి నీకు।తగ సమర్పింతు గొనుము నా
తప్పుసైచి। నవఘనశ్యామ కుటిలదానవవిరామ। జానకీరామ రవికుల
సార్వభౌమ॥ ౧॥

దండంబు భండనోద్దండపండిత నీకు దండంబు చండకోదం
డ నీకు। దండంబు పాలితాఖండలామర నీకు దండంబు శితశరకాండ
నీకు।దండంబు మరకతకుండలాంచిత నీకు దండంబు హితపంచతుండ
నీకు। దండంబు హతదైత్యమండలాధిప నీకు దండంబు భువనపిచం
డనీకు॥ చండమార్తాండతేజ నీయండ జేరి। నాడ నీవాడ నన్ను గాపా
డవలదె॥ నవఘనశ్యామ కుటిలదానవవిరామ। జానకీరామ రవికులసా
ర్వభౌమ॥ ౨॥

నీమహామహిమంబు నెరి బ్రస్తుతింపగా మేలైన తామరచూ
లిగాను। నీనామసారంబు మానుగా జవి గొన నరయగా వృషభవా
హనుడగాను। నీదయాసారంబు నియతి సన్నుతి జేసి సంతసింపగ విభీ
షణుడగాను। నీలోతు గనుగొని నిన్ను ధ్యానింపగా మతిమంతుడగు

వాయుసుతుడగాను॥ చేరి మూఢుడనగు నన్ను జేరదీసి।యేవిధినిబ్రో
తువో నాకు నీవె దిక్కు। నవఘనశ్యామ కుటిలదానవవిరామ। జాన
కీరామ రవికులసార్వభౌమ॥ ౩॥

ప్రశమించరాని దుర్దశలు వాటిల్లినచోట నాపదలందుచోట లే
మి। దొడరినచోట పెక్కుడుములు బడుచోట పలుపిశాచములు పై
బడినచోట। నడవిలో దస్కరు లడ్డగించినచోట గడులోతునీటిలో బ
డినచోట। మారిసోకినచోట దారిలో బులిగన్నచోట భీతిల్లినచోట
గలిత॥ మంత్రతంత్రంబు లెన్నేని మందులున్న। దుదకు నీనామమె
దిక్కుగద జనులకు। నవఘనశ్యామ కుటిలదానవవిరామ। జానకీరా
మ రవికులసార్వభౌమ॥ ౪॥

నీనామమంత్రంబు మూనుగా జదివిన సకలభూతగ్రహో
చ్చాటనంబు। నీనామమంత్రంబు లో నాట నుడివిన యమభటావళికి
భయానకంబు। నీనామమంత్రంబు నెరి జపించిన మహాపాపసందో
హనిర్వాపణంబు। నీనామమంత్రంబు నిఖిలజీవులకెల్ల నరవితో నిహ
పరసాధనంబు॥ భళిర నీనామమంత్రప్రభావ మెన్న। నజున కణుమాత్ర
మైన శక్యంబుగాదు। నవఘనశ్యామ॥ ౫॥

కడుపారగా నిన్ను గన్నట్టి కౌసల్య తొలుబామునందేమి స
లిపెనొక్కొ। కొడుకుగా నినుగాంచి తొడలపై నిడుకొన్న దశరథే
శ్వరు డెంతధన్యుడొక్కొ। వావిదెల్పుచు నిన్ను సేవించుబంధువుల్
చెలగి యెట్టితపంబు చేసిరొక్కొ। పలుమారు కైవారము లొనర్చు
వందిమాగధు లెంతపుణ్యసంకలితులొక్కొ॥ నీదుకరుణకు పాత్రులై
నెగడినట్టి। వారి సిరులెన్న దరముగా దేరికైన।నవఘనశ్యామ॥ ౬॥

తల్లిదండ్రులమాట్కి దరిలేనినెనరుచే నిఖిలజీవులబ్రోవ నేర్చు
టయును। తీరుగా సంగణపారిజాతమురీతి బుధులబోషించు నైపు
ణ్యములును। దిక్కుమాలినవారి దీనానులాపముల్ విని వారి రక్షిం
చివెలయుటయును। శరణన్నవాడెట్టి శత్రువైనను ముద్దుపట్టిగాజూచి
చేపట్టుటయును॥ ప్రకటకళ్యాణగుణముల బ్రబలుటయును। నీకెతగు
గాక షహబాసు నీరజాక్ష। నవఘనశ్యామ॥ ౭॥

జగతిలో నిహపరసాధనమూలమై మారుతాత్మజతపస్సార
మగుచు। గాశిలో మరణంబు గాంచినవారికి మహనీయతారకమం
త్రమగుచు। కలితశీతాచలకన్యక కెడలేని భాగ్యమై దినదినపఠిత
మగుచు। పతితుడై దయమాలి బరగువాల్మీకికి నారూఢిగా జపసార
మగుచు॥ పతితపావనవిఖ్యాతి భాసమాన। మానితంబయ్యె నీనామ
మంత్ర మహహా। నవఘనశ్యామ॥ ౮॥

మొలకనవ్వుల ముద్దు గులుకుచుండెడుమోము నిండుజాబిల్లి
తో నీటుగొలుప। నిరులుపై గప్పిన నరనెలచాటున గురులు వెన్నెన
టిపై గులుకుచుండ। మిసిమిగల్గినతళ్కు పసిడిమావిడిపిందె లెసగజె
క్కుళ్ల నీరెండగాయ। బాలుపుగా జిన్నారి బుగ్గపై నుంచిన చిన్నికా
టుకచుక్క చెలువుజూప॥ దల్లిదోయిళ్ల నీళ్లాడి యుల్లమలర। బిల్ల
డన నెట్లు బండిలో నల్లనయ్య। నవఘనశ్యామ॥ ౯॥

నెలవంటిమోము వెన్నెలబోలు నగవు పల్కుల తియ్యదనము
చెక్కులయొయ్యార। మలరువిల్బొమలు చేరలమీరినట్టి కన్నులు ని
గనిగలాడు పలువరుస వగలుగుల్కు నెరిముంగురులు తియ్యవిలుకా
డు వలగొనజాలు మై వలపుసొలపు। కలగలరొమ్ము చక్కనిమోవి
ముజ్జగంబులుగల బొజ్జకై తలపులీన॥ దనరి పాపనివదువున దవిలితల్లి।
నంటి పురిటింట నేరీతి నుంటివహహా॥ నవఘనశ్యామ॥ ౧౦॥

జేజేల దొరదాల్చు సింగాణి సిరిమించు పరుపైనవిల్లు యూ
ఫంబుగాగ। నరులపై నడరించుతరి వెన్ను తియ్యని కరుకుటమ్ములు
కుశాగ్రములుగాగ। నెల్లలోకములు ఘూర్ణిల్ల జేసెడు గుణనాదం
బు సామగానంబుగాగ। నక్షయాభిఖ్యచే నమరుతూణీరముల్ వరలు
చుండెడు స్రుక్స్రువములుగాగ॥ యాజకుడవయి కోపాగ్నియందు
పంక్తి। కంఠపశువును వేల్చిన ఘనుడవౌర॥ నవఘనశ్యామ॥ ౧౧॥

గజరాజు నీకేమి కానుకలంపెనో ద్రౌపది నీకేమిధనమొసం
గె। బ్రహ్లాదుడేపాటి పసిడిచేకూర్చెనో రావణానుజు డేమిరాజ్యమిచ్చె।
నలకుచేలుం డేమి కలిమి నీకర్పించె జెలువుగా ధ్రువుడేమి చెయ్యదడి

పి।మారుతినీకేమి కోరిక ల్సమకూర్చె నంబరీషుండేమి యరుతబెట్టె॥ వారినందరి బ్రోచిన వరుసతోడ । నేలకుండిన రిత్త నిన్నేలవిడుతు॥ నవఘనశ్యామ॥ ౧౨॥

నీవాడ నన్నను నెనరుతో నిక్కువు పగవానినైన జేపట్టుటయును। కావుకావన నెంత కలుషాత్ముడైనను చెలువుమీర జరింపసేయుటయును। మారుమారన నెంతమగవాసనైనను పనిబూని జముపోలి కనుచుటయును। కరుణించుమన్నను నిరుపేదనైనను విభవాన్వితునిగ గావించుటయును॥ నీకె తగుగాని మాటపరాకుమాని। యండజేరిన నను బ్రోవకుండ వశమె। నవఘనశ్యామ॥ ౧౩॥

ఇరువంకలను జేరి భరతశత్రుఘ్నులు చూపరు పొగడ వీచోపులిడగ। సన్నద్ధుడై నీదువెన్నంటి సౌమిత్రి కొమరారు ముత్యాలగొడుగుబట్ట। మేఘంబులోనున్న మెరుపుకైవడి సీత వినతయై వామాంకమున వసింప। నంతరంబలర బ్రహ్మానందమగ్నుడై పవనాత్మజుడు నిజపదము లొత్త॥ సకలసేనాధిపతులు హెచ్చరిక దెలుప। నిండుకొల్వున్న నిను జూడకుండ వశమె। నవఘనశ్యామ॥ ౧౪॥

శ్రీమదయోధ్యాపురీవరేశ పరాకు దశరథరాజనందన పరాకు। కమలాప్తకులవార్ధికైరవాప్త పరాకు శతపత్రపత్రలోచనపరాకు। జనకవాక్యప్రతిష్ఠాధురీణపరాకు ధరణీసుతామనోహరపరాకు। శరణాగతత్రాణసక్తచిత్త పరాకు కలితరాజన్యశేఖరపరాకు॥ సకలలోకైకరక్షణాక్షణపరాకు।కపటమానవ లక్ష్మణాగ్రజపరాకు।నవఘనశ్యామ॥౧౫॥

తలపోయు నెల్లజీవులకును సమకూడజాలని భూసురజన్మమెత్తి। వేదశాస్త్రపురాణవిధులెరింగిన సుజనులతోడ గడుమైత్రిసలిపియునుది। నమును తనువు సుస్థిరమని సతి సుత హిత ధననిలయ సంపదలను నమ్మి। కొని దురాగ్రహమున గుణహీనులై చచ్చి నరకబాధలకు లోనగుచు మరల॥ బుట్టునేకాని నీమీద బుద్ధి నిలిపి। మహితగతి బొందరెన్నిజన్మములకైన। నవఘనశ్యామ॥ ౧౬॥

దయజూడుమంటి నీదాసుడనంటి నీచరణంబులను విడజాల
నంటి। నపరాధినంటి నాయందున నెనరింత బూనుమంటిని పగమాను
మంటి।నీకతోడ వృథాపరాకు చేసితివి నీ ప్రభుతావిశేష మీపాటిదేన।
పుడమి కూతురను కారడవికి దీసి పెక్కిడుముల బడ జేసి గడుసుమీ
రి॥ నట్టి నినుబట్టికొని రట్టుబెట్టకున్న। సావధానంబుగా నన్ను బ్రో
వగలవె। నవఘనశ్యామ॥ ౧౭॥

మానుగా విరిమల్లెనూనెచే దలయంటి చెలగి కాశ్మీరంబు న
లుగుబెట్టి। చల్లని పన్నీట స్నానంబు గావించి తడియార నొత్తి కుంత
లములార్చి। కమ్మనిగంధంబు కలయగా మైబూసి తిన్నగా నుదుటిపై
దిలకముంచి। పోగు లుంగరములు పోచీలు మౌక్తికరత్నహారములు
తురాయిబెట్టి॥ చెలగి కౌసల్య ముస్తాబుసేయ వన్నె। గన్న మాయ
న్న నీసొబగెన్నదరమె। నవఘనశ్యామ॥ ౧౮॥

వెన్నుడవైనట్టి నిన్నుగాంచినగదా కన్నులున్నందుకు గలఫ
లంబు। పొలుపుమీరగనిన్ను బూజజేసినగదా కరము లున్నందుకు గ
లఫలంబు। మనమార నిను స్మరించినగదా నెమ్మదిగలిగియున్నందుకు
గలఫలంబు। దేవ నీదగుసేవ గావించిననుగదా కాయమున్నందుకు గ
లఫలంబు॥ క్షితిని మానవులకు పురాకృతవశమున। గాక నీసేవ యూ
రకే కల్గుటెట్లు। నవఘనశ్యామ॥ ౧౯॥

అడిగినచోట లేదని వచింపవు దీనసంరక్షణ మహావిచక్షణుడ
వు। సదమలకరుణారసస్ఫూర్తి గల గుణశాలివి దేవతాసార్వభౌము। డ
వు సర్వజనహితుడవు భక్తపాలన సత్కళాపారీణచతురమతివి। స
త్యవాక్యప్రతిష్ఠాధురంధరుడవు సంపూర్ణవిద్యావిశారదుడవు॥ నీకు
సాటెవ్వరీ రేడులోకములను। నీరదాకార నీసాటి నీవెగాక। నవఘన
శ్యామ॥ ౨౦॥

తల్లిదండ్రులరీతి దయ యన్నదమ్ములకై వడి నెనరు భూకాం
తునిగతి। దుష్టనిగ్రహమును శిష్టరక్షణయును జైవాతృకునివలె జ
ల్లదనము। సరసీరుహాప్తునిచందము లోకైకఘనతమోభేదన కలితశ

కి॥ శమునునిపోలిక సమతావిశిష్టత విబుధతరువుమాడ్కి వితరణంబు॥
గల మహాత్ముడవనుచు నాతలపులోన। నిన్ను విడలేను నమ్ము మా
యన్న తాన। నవఘనశ్యామ॥ ౧౧॥

అఖిలలోకములు మాయామయాత్మకముగ బెంపుదీపింప గ
ల్పించిపెంచి। యాబ్రహ్మకీటపర్యంతంబు సరమందు దవ్వులుకొన్నట్టి
సూత్రమువిధమున। సకలాంతరాత్మవై సాక్షివై మోక్షప్రదాతవై
సకలనిర్నేతవగుచు। విమలదర్పణకరండమున నిర్మలముగ వెలుగుచుం
డెడు దీపకళికపోల్కి॥ నరయ కాలత్రయాబాధ్యమై తురీయ। మగుచు
దనరారు నీకు జోహారుజేతు। నవఘనశ్యామ॥ ౧౨॥

కటికచీకటిలో నొకడవై వెలుంగుచు ఘనతరేచ్ఛామాత్ర క
లితమతిని। మాయనైకొని సృష్టిసేయగా గమకించి యండమొక్కటి
పరమాద్భుతముగ। రచియించి సచరాచరములందు బుట్టించి బహిరం
తరంబుల వలయమందు। బరికింప వెలిని లోపల హేమమయముగునట్లు
గా బరిపూర్ణమగుచు దనరు॥ నీచరణభక్తి ప్రాప్తి నెగడకున్న। జెల
గి భవసాగరము దాటగలరె నరులు। నవఘనశ్యామ॥ ౧౩॥

బీజముల్ కర్షకుడోజగా సమకూర్చి యదనైనయెడ భూమియం
దు జల్లు। పొలుపున ముజ్జగంబులు బొజ్జలో నుంచి పెంపుదీపింప గ
ల్పించి మించి। యనుదినమాయాపటాంతర్హితుండవై కర్మసూత్ర
ముల జక్కగ దవిల్చి। కపటనాటకమును గయచేసి మనుజుల నాడింపు
దువు బొమ్మలాటవలెను॥ బూని నీశక్తి బూర్తిగా బొగడ నొక్క। నో
రుగలవారి కేరీతి దీరు నహహా। నవఘనశ్యామ॥ ౧౪॥

అవనిలోపల జన్మమైనదిమొదలుగా నరుడు దేహాభిమానము
న జిక్కి। ధనసుతహితబంధుదారానురక్తిచే బరగి యాశాపాశబద్ధుడ
గుచు। భవనకూపంబులో బడి నాస్తికుండయి వృద్ధుడై రోగనిబద్ధుడ
గుచు। సంసారమును విడజాలక ఖిన్నుడై తంతుకీటమురీతి తనువు దొ
రగి॥ పుట్టునేగాని మది నిన్ను బూజజేసి। యుర్వి నిర్వాణసౌఖ్యము
నొందగలడె। నవఘనశ్యామ॥ ౧౫॥

శ్రీవిరాజిత తులసీదళాంచితదామ ప్రకటదోర్బలజితపరశు
రామ। ప్రవిమలాశాంతరభరితయశస్తోమ కామారినుతనామ కదన
భీమ। సరసిజాసననుత సరససద్గుణధామ మనుకులాంభోరాశిమహిత
సోమ। విశదపరాంగనావిముఖ సువ్రతకామ పాలితసుత్రామ భవవి
రామ॥ నామనోరథ మీడేర్చి నన్ను గావ। వలెను నీకన్న నన్యదైవ
ముల నెరుగ। నవఘనశ్యామ॥ ౨౬॥

కలగన్న యర్థముకైవడి తనుసుతలలితదారాగారములను వి
శ్వ। సింపక గడుతృషచే మరీచికల గన్గొని జలభ్రాంతినొందిన విధము
న। భోగభాగ్యములందు రాగముంచక బుద్ధి పరమార్థమందున బాదు
కొల్పి। సత్యశీలవ్రత సదసద్వివేకముల్ గలిగి తృష్ణకు లోనుగాక హృ
దయ॥ వికచకమలాంతరస్థితి వెలుగు నిన్ను। భక్తి సేయక దొరుకునే
పరమపదము। నవఘనశ్యామ॥ ౨౭॥

కలియుగమందుముష్కరులై దురాగ్రహగ్రస్తులై గర్వసంకలి
తులగుచు। దుర్దానతస్కరదుష్టాన్నభోజనవృత్తిచే నర్థ మార్జించి య
ర్థు। లెదురైన లాకేత్వమిచ్చి సదాభిన్నభావులై కాలము త్రోవజావ।
గఫవాతపైత్యము ల్గ్రమ్మగా వగపుచే నాలుబిడ్డల విడనాడలేక॥ కంట
దడిబెట్టుగాని నిక్కముగ దావ। కస్మరణసేయ రతికౌతుకమునైన।
నవఘనశ్యామ॥ ౨౮॥

కరుణతో ద్రుపదభూవరతనూజకు కోక లచ్చుగా గృపజేసిన
ట్టిమాట। మహితచక్రముచేత మకరిని బడగూల్చి గట్టిగా గరినేలినట్టి
మాట। తరగనిసంపదల్ దయచేసివేడ్కతో నల కుచేలునిబ్రోచినట్టి
మాట। శరణన్న నల విభీషణున కాక్షణమె లంకాధిపత్యం బిచ్చినట్టి
మాట॥ తథ్యమైయున్న నాచంద్రతారకముగ। వేడుకలరార నను ద
యజూడవలదె। నవఘనశ్యామ॥ ౨౯॥

ఖరనిశాచరపయోధర మహామారుత నిర్జరారి భుజంగనీలకం
ఠ। తాటకాప్రాణవాతవ్రాతభీషణవాతాశనీకృతశాతబాణ। దశకంఠ
గళభుజధారుణీధరశితశతకోటి కోటిభాస్వత్ప్రతాప। దండకావనగతా

ఖండలాహితదైత్యమండలాంచితసన్యచండకిరణ॥ ప్రథితరిపుజనరణరం
గఫాలనయన। తాపసాహితకాననదావదహన। నవఘనశ్యామ॥ ౩౦॥

సింహమధ్యముకన్న సిరిగన్న నడుమున దిటముగా జల్తారు దిం
డుగట్టి। యంబరమణికి తేజం బొనర్పగజాలు డంబుమీరిన కిరీటంబు బె
ట్టి। శీదాఖశీదాపు తేదారులాగుపై మట్టుమీరిన పట్టుదట్టి గట్టి । మే
ఘంబులోనున్న మెరుపనా బంగారుసింగాణి రంగుగా జేతబట్టి॥ యసు
రులవధించు నీ వీరరసము జూచి। యమరులకునైన నడగుండె లదరకు
న్నె। నవఘనశ్యామ॥ ౩౧॥

మిక్కిలిమింటిపై మెరయజాలక రవి మతిహీనుడై నిజగతిదొ
లంగె। పంటవాల్వాల్గంటి కంటనీరొత్తుచు నెగిలి కుమ్మరసానపగిదిదిరి
గె। దీరని బెగడు నిండార బ్రీటలువారి తారాపథంబెల్ల బూరటిల్లె। భూ
భారమునుదాల్పబోక దిగ్గజములు జాలినొందుచు మూలమూల క్రో
దిగె॥ గన్నుగవ కెంపు సొంపార గడకతోడ। బ్రహ్మశర మబ్ధిపై నీవు బ
రుపునపుడు। నవఘనశ్యామ॥ ౩౨॥

చివ్వ నెవ్వనికైన ని వ్వసుంధరలోన గొలువు గొల్చెనె ము
న్న క్రోతిపిండు। యే యుగంబులనైన హాయిగాబొమ్మని త్రోవజూ
పించెనే తోయరాశి। నరులచేనైన వానరులచేనైనను కలగెనే త్రొల్లి
రాకాశిమూక। పరశక్తిగూలిన నరుడెన్నడైనను మరల జీవించెనే మం
దుచేత॥ విలసదఘటనఘటనాప్రవీణశక్తి । నలరుచున్నట్టి నీచేతనా
మొగాక। నవఘనశ్యామ॥ ౩౩॥

తరు లురుగిరులు వానరులచే దెప్పించి గట్టిగా సేతువు గట్టినా
వు। ఘనబలాన్వితుని వాలిని విలోకమునకు బరిపి సుగ్రీవు జేపట్టినా
వు। సురనిశాచరభయంకరరావణుని ఖడాయించి తత్పురి రోఖాయిం
చినావు। పదరజంబున గానబడియున్న రాతిని జెలువార నాతిని జే
సినావు॥ సకలలోకైకరక్షణాక్షణుడ వగుట। నిలను దుస్సాధ్యమగుపని
గలదె నీకు। నవఘనశ్యామ॥ ౩౪॥

ఎవ్వానిరవితేజ మీక్షించినంతనె విబుధదైన్యతమంబు వి
రిసిపారె। నెవ్వానిముఖశశి నెలమి గన్నంతనే కవిచకోరపిపాస కడకు

జారె! నెవ్వానిఘనదీప్తి నింపుతో జూచిన భక్తసస్యౌఘము వాడుదీ
రె! నెవ్వానిబాణాగ్ని నెదుటగాంచినదేవతాగిఘోరాటవి నీరుగారె॥
నట్టి నీశక్తి వినుతింప నలవియగునె। నలువకైనను వేనోళ్ళ చిలువ
కైన। నవఘనశ్యామ॥ ౩౫॥

ఒక్కడుకోటపై నక్కజంబుగదాటి రావణమకుటముల్ రా
లదన్నె। నొక్కడంభోరాశి గ్రక్కునలంఘించి కడుకోపమున లంకగా
ల్చిపుచ్చె। నొక్కడు శయ్యపై నొదిగియుండినవేళ నెనసి మందోదరి
నీడ్చి తెచ్చె। నొక్కడు దశదిశల్ పిక్కటిల్లగ వార్థి గండశైలములచే
గట్టివైచె॥ దలప నీమ్రోల నిట్టివస్తాదులుండ। నిలనుసాధింపరానిది గ
లదె నీకు। నవఘనశ్యామ॥ ౩౬॥

తల్లిదండ్రులయెడ దరగనిభక్తి తమ్ములపట్ల తాత్పర్యకలన సే
వ। కులమీద నెనరు దీనులవంక ప్రేమాతిశయము సుస్థులందు వాత్సల్య
గరిమ। ప్రజలపైగారుణ్యభావము బక్కచుట్టముల జాడ దయారసము
పరవని। తలగన్నవిముఖత తగినట్టి గురువులపాలిట నమ్రతాప్రాభ
వంబు॥ గలదయాశాలివనుచు నాతలపులోన। నీచరణభక్తి విడలేను
నిముసమైన। నవఘనశ్యామ॥ ౩౭॥

నీకల్పితం బెట్టిదోకాని గిరులువేయించి మున్నీటదేలించినా
వు। నీచిత్రమేమందు నిముసంబులో ఖరాసురముఖ్యులను తెగజూచి
నావు।నీశక్తివినుతింప నేర యామమున భీష్మించి ద్రోణాద్రి తెప్పించి
నావు।నీచాకచక్యము గోచరించునె లంకమించి రోషించి సాధించినా
వు॥ పుడమి నొరుచేత సాధింపబడనిపనులు। పూని నెరవేర్చితివి నీకె
పోలుగాక। నవఘనశ్యామ॥ ౩౮॥

అద నిదేయని శితప్రదరముల్బరిపి రాక్షసులగుండెలు ఝులు
ఝుల్లుమనగ। నేదిక్కుజూచిన నాదిక్కునీవయై శిరములు కరములు
నరములురములు।లర కాలు లర చేతు లరదము లురగము ల్ద్విరముల్కా
ల్బురతీటు వోవ।కలన తుత్తునియలుగా జేసి పూర్తిగా నెలమి భూతము

లకు బలియొసంగి॥ వీరరౌద్రరసస్ఫూర్తి మారు లేక। సమరు లోకైక నాథ నిన్నాశ్రయింతు। నవఘనశ్యామ॥ ౩౯॥

తలలు వ్రేవులు కబంధములు కంఠంబులు శిరములు గొడుగులు చేతులు దర। ములు జానువులు ముఖములు చరణంబులు కరితురంగరథాళి కాల్బలంబు। లటిముఠి పొరిపొరి పరియలుగావించి యమితరక్తప్రవాహములనించి। నీహుహుపార్శ్వహదరి నిర్జరుల్గని మేలుమేలని వినుతింప బాళిమెరసి॥ నట్టినీగుట్టు నడివీధి బెట్టుకున్న। నన్ను కాపాడలేవేమొ నలిననయన। నవఘనశ్యామ॥ ౪౦॥

నీలమేఘము డాలు డీలుసేయగజాలు మెరుగారు నల్లనిమేనితోడ। కలువరాయని సిరి గాసిజేయగజాలు ముద్దులూరెడు నగుమోముతోడ। మారునిబల్మారు మారు మారనదగు జిగితళ్కుబగుల్కు సోయగముతోడ। మేఘంబులో తీవె మెరుపనా డాపలచెలువారగానున్న సీతతోడ॥ నమరు భవదీయదర్శనం బబ్బజేసి। నిబ్బగా నన్ను బ్రోవు మాయబ్బ కాన। నవఘనశ్యామ॥ ౪౧॥

భవ దమానుషబాహుబలసమగ్రస్ఫూర్తి గురుతుగా రావణాసురు డెరుంగు। భవదీయసునిశితప్రదరసామర్థ్యము తార్కాణముగ నదీధవు డెరుంగు। తావకపూతపాదరజఃప్రభావము హితవుగా గౌతమసతి యెరుంగు। త్వన్మహాపతితపావననామసారంబు సొంపుగా నంజనీసుతుడెరుంగు॥ గాని నావంటిమనుజుడు గాంచగలడె। భక్తుడని నీకు నీవె బ్రోవవలెగాక। నవఘనశ్యామ॥ ౪౨॥

బొజ్జనిండగ దల్లి బువ్వ నీకటుపెట్ట కోరి సౌమిత్రి నీగొడుగుపట్ట। దేవతుల్ నీమీద దివిరి పువ్వులగొట్ట రహివశిష్ఠుడు చేత రక్షకట్ట। కౌశికు నిను బంపుకైక నందరుదిట్ట నరయ నీనాభియందజుడుపుట్ట। దనుజసంఘమున కంతకుడవై గన్పట్ట పైగప్పితివిగదా పసిడిబట్ట॥ తెలప నీకీర్తి దశదిగంతములు ముట్ట। కరుణజూడవు నాతోటి కాని పట్టు। నవఘనశ్యామ॥ ౪౩॥

చిరుతవై యారగించినది గుజ్జనబువ్వ సీత నీపై బూలచెండ్లు
రువ్వ।కదసి యోచింపగా గౌసల్య నీయవ్వ నెరిరక్కసులతోడ నీకు
చివ్వ।కానకీవేగుచో కైకనందరు నవ్వ కోరి సుమిత్రి నీకురులుదువ్వ।
దాసులందున నీదు దయ వేలుపుల త్రవ్వ పరగనీయోగికి పసిడిగవ్వ॥
కోరి నీకీర్తి వినుతింతు నోరునొవ్వ। నెనరు నామీద లేకున్న నీకుర
వ్వ। నవఘనశ్యామ॥ ౪౪॥

జలజాసనునికైన దెలియదు నీగుట్టు యఖిలజీవులకు నీవాట
పట్టు। నిన్నెరుంగకయున్న నిఖిలయోనుల బుట్టు పిలిచితే నీప్రేమప
ట్టుజెట్టు।నీకట్టుపుట్టము నెరవైన హొంబట్టు మానవాశనులందు కాని
పట్టు। యడవికి నీవేగునపుడు తమ్ముడు జట్టు కలిగెనుగా నీకు కైకర
ట్టు॥ యేలదాసులయందు నీకింత బెట్టు। కరుణతో జూడవేని మాకాని
యొట్టు। నవఘనశ్యామ॥ ౪౫॥

కోసలేంద్రునిరాణి వాసిగానీతల్లి ప్రాకటంబుగ శాంతనీకుచెల్లి।
మెరుగారు నీ తేజి మెడచూడగాబొల్లి కవులపై నీప్రేమకల్పవల్లి। నీ
చిన్నినగుమోము నెరవైన జాబిల్లి పరికింప నీమామపాలవెల్లి। నీభ
క్తిగలవారు నెరిజనించరు మళ్లి తలప నీసతిగుణములమతల్లి॥ నీదయా
రసదృష్టి నామీదజల్లి। మనమలర బ్రోవకున్న నీమాట బొల్లి। నవ
ఘనశ్యామ॥ ౪౬॥

పోరి దయాశౌచము లొప్పలగా నీసొమ్ము కడ తేర్చె నరుల నీ
కరుకుటమ్ము। పసిడిగద్దియకన్న బరువైన నీరొమ్ము తగవచ్చవిల్తుని
తల్లికిమ్ము।రాజితంబగు పక్షిరాజు నీకెక్కుమ్ము వురుడు గాంచనిది నీభు
జబలమ్ము। సారహీనులుజూడ లేరు నీరూపమ్ము నెరితప్పిపోదుగా నీవ
రమ్ము॥దవిలినామీద నేల సేతువు చలమ్ము।మంచిదే కాని మనసులో
నుంచుకొమ్ము॥ నవఘనశ్యాము॥ ౪౭॥

కల్పభూజమునైన గడకొత్తునీబారు నిర్జరారుల జేరునీకటారు।
కడకులోకములు నీకడుపులోపల దూరు పాకారి నీకంపె పసిడి తేరు।

మీనధ్వజునిగేరు మెరుగారు నీతీరు తగ కపిరాజు నీదగువజీరు।నీగజ భవభవుల్ నీసమానులుగారు దశకంఠునకు నీకు తగనిపోరు॥ పరగనీ కన్న వేరె ప్రాపకులు లేరు। కరుణజూడుము లేనిచో గత్తిదారు । నవ ఘనశ్యామ॥ ౪౮॥

నీదంతములచాలు నేర్పైనవజ్రాలు పై పల్లెవాటు హాంబట్టు శాలు। నీపాద సేవకుల్ రూపింపజేజేలు జ్ఞానమార్గంబు నీకానవాలు। కైక నిన్ జేసెగా గరుకు కానలపాలు వెలయనీపల్కులు వేనవేలు। నీ పేరు దెల్పితె రూపారు పాపాలు నోలి నీకురులు నీలాలడాలు॥ కడకు నీసేవకన్న నుగలదె మేలు। భక్తజనలోల నీదు ప్రాపక మెచాలు । నవ ఘనశ్యామ॥ ౪౯॥

కర మర్థి నీపాదకమలము ల్గొలిచిన ఘనులమహాత్వ మెంతని వచింతు। కదసి నీదగు ప్రదక్షిణముగావించిన మనుజుల భాగ్యమెంత ని వచింతు। భక్తితో నీపూజ దక్తిగా జేసిన జనులసంతోష మెంతని వచింతు। జెలువుగా దావక సేవ సల్పినవారి యనుపమసుకృత మెంత ని వచింతు॥ గురుతుగానిన్ను లో నమ్మికొనిన సకల। సుజనులకుము క్తిమార్గము చూరగాదె। నవఘనశ్యామ॥ ౫౦॥

మొలకనవ్వుల ముద్దుగులుకు నీనెమ్మోముతోటి మాటికి శశి సాటిగాక। బూటపూటకు తేటపోనాడిఖన్నుడై యక్ష్మరోగనిపీడితా త్ముడగుచు। దగనున్నచో భవద్దరహాస కందళమహిమచే జెలవునివ ను పుచునుచు। నడుగు తామరలపై బడి లేనకుండిన కొమరారు కేరేని కొమ్మలనగ॥ బ్రిబలుచున్నట్టి పదనఖపంక్తిగలిగి।దనరుచున్నట్టి రఘు వర నిను భజింతు। నవఘనశ్యామ॥ ౫౧॥

బహుముఖంబుల దావదహనంబు దరికొని ఘోరకాననము ను నీరుజేయు।సరణి నీనామము చక్కగా దరగని భక్తితో మనమం దు పాదుకొల్పి। పఠియించినను పునర్భవమహాగంభీరవారాశి గడువ గా వచ్చుననుచు। శ్రుతులచే వండితవితతిచే జెప్పులార నిక్కంబుగా

విని నియతితోడ॥ నమర నీపాదకమలము లాశ్రయించి।నాడ మూరా
డబోక కాపాడవలయు। నవఘనశ్యామ॥ ౫౨॥

భవదీయగాంభీర్యపటిమతో సరిరాక గడలి మహాభంగకలి
తయయ్యె। ద్వత్ప్రతాపస్ఫూర్తి దవిలి రాజాలక దినదినంబున రవి వ
నధిగుంగె। తావకవదనపద్మముతోటి తులగాక పక్షహానికి శశి పాలు
పడియె। మహితయుష్మద్విక్రమము గాంచి భీతిచే గొదమసింగంబులు
పొదలదూరె॥ నఖిలకళ్యాణగుణశాలి యను కితాబు। నీకె తగుగాక
నీ రేడులోకములను। నవఘనశ్యామ॥ ౫౩॥

తలప నెవ్వాని నాభిజలరుహంబున నల మొదలివేలుపు జూడ
నుదితుడయ్యె। బరికింప నెవ్వాని పాదపంకజమున జహ్నుతాపస కన్యసం
భవించె। దిరముగా నెవ్వాని చరణరజఃపాళి తీరుగా శ్రుతిశిఖల్ గోరు
చుండె। దండిగా నెవని పిచండకరండంబు బ్రహ్మాండభాండనివాస
మయ్యె॥ నట్టివై కుంఠనిలయుడ వైన నిన్ను। సన్నుతింపంగ విధికైన
శక్యమగునె। నవఘనశ్యామ॥ ౫౪॥

దయగలచూపు మందస్మితంబు సకలసుజనానురాగవిస్ఫురణ
ము మద। ఖరనిశాచర భయంకర నిగ్రహోదగ్ర విగ్రహంబు స
మగ్రవితరణంబు। సదమలవిద్యావిశారదత్వము పల్కు బొంకమి లో
కైకపూజ్యమహిమ। పరిపూర్ణసత్కృపాపాత్రభవం బసమాననవరస
జ్ఞత గురుసమ్మతయును॥ నిఖిలగుణజాలమెల్ల ఘనీభవించి। కదసిచూ
డగ నీయందె గాననయ్యె। నవఘనశ్యామ॥ ౫౫॥

కటముల మదధార కరిగిజారినరీతి గండభాగములందు కప్పుదే
ర। మోముజాబిల్లిలో మొనసినకందన నూగుమీసపు రేఖ బాగుమీ
ర। దోలకరిమబ్బులో దులకించుమించన వామాంకమున నుండ భూ
మితనయ। ఘనవితీర్ణ ప్రభా కలితమై దనరారు కల్పశాఖలరీతి గర
ము లమర॥ దినకరునికన్న నధికమై తేజమొప్పు। నిందుకొల్వున గూ
ర్చున్న నిను భజింతు। నవఘనశ్యామ॥ ౫౬॥

పరికింప నెవనిప్రాపకబలస్ఫూర్తిచే మిన్నంటి దినమణి మెర
యుచుండె।దిరముగా నెవ్వనికరుణకు పాత్రుఁడై విధుఁడు సత్కళలచే వె
లయుచుండె। బాలుపుగా నెవని సంపూర్ణదయాప్తిచే గరమొప్ప నన
లుఁడు గ్రాలుచుండె। గదసి యెవ్వనియనుగ్రహముచే గ్రహములు దివి
రి యాకసమున దిరుగుచుండె॥ నట్టి లోకైకనాథుఁడవై జగమున। దన
రుచున్నట్టి రఘువర నిను భజింతు। నవఘనశ్యామ॥ ౫౭ ॥

జనకపుత్రికళత్ర సహజమిత్రామాత్య పశుభృత్యగోధనబం
ధుజాల। వితతవల్లీసమావృతమహాశాపాశబంధుర భవనకూపమున
జారి।పైకి రాదగు సదుపాయంబులేక మోహాంధతమిస్రమం దరయఁజి
క్కి।యున్న నాయెడ నింత కన్నెడమాని తాపకసత్కరావలంబన మొ
నంగి॥ కరుణఁజూడుము శరణన్న గాతు ననుచు। బిరుదుబూనిన నీకింత
బిగువు తగునె। నవఘనశ్యామ॥ ౫౮ ॥

అఖిలమోహాస్పదంబైనరూపముచేత బరగినచెలి ధర్మపత్నిగా
క। భాగ్యహీనుండయి బహుళసంతతిగాంచి చెలగి తత్పోషణ సేయలే
క। తెరవాట్లు కొట్టుచో దివ్యతాపసులను వీక్షించి దుర్వృత్తి విడచి
హృదయ। మున మరేతి జపంబు ముని ముట్టగా జేసి యెలమి వాల్మీకి
మునీంద్రుఁడయ్యె॥ భళిర నీనామమంత్రజాపకులమహిమ। తెలిసి విను
తింప మనుజుల కలవియగునె। నవఘనశ్యామ॥ ౫౯ ॥

జనకనిర్దిష్ట ధూర్జటిశరాసనము గన్గొని కటిగటిచేలమున బిగిం
చినరవరోత్తములెల్ల బరికింప నడిమికి చెరుకుకై వడి బూని విరువ న
పుడు। భవదమానుషశక్తి బరికించి మేలుమేలని సుధాశనులెల్ల విను
తి సేయ।వలసి భూసుత నిన్ను వరియింప దత్త్రప వెలయఁగా నితరరాజు
ల వరించె॥ నిలను సామర్థ్యమున్న వారలకు మేలు। గాక బలహీనుల
కు మేలు గలుగుటెట్లు। నవఘనశ్యామ॥ ౬౦ ॥

కుటిలుఁడై యల సోమకుడు వేదములు తస్కరించి మున్నీటి
లో బొంచియుండ। గరగర మీనముల్ కరుకుగుద్దులు నెరి కరుకుకో

రలు బలువరుపుమేను।గల గండుమీనువై కడలిలో బిరబిర జొరబడి
యారక్కసుని వధించి। తదుదరాంతరగతశ్రుతితతి గైకొని యతులి
తగతి శతధృతికి నొసగి॥ యసదృశస్థితి జగము లింపెసగగాచి। నట్టి
యపటస్వరూప నిన్నాశ్రయింతు। నవఘనశ్యామ॥ ౬౧॥

నిరుపమగతి సురాసురులు మందరగిరి కవ్వంబుగా భుజంగపతి
త్రాడు। గా నొనరించి పాల్కడలి కుంభము జేసి యంతకంతకు మో
ద మతిశయిల్ల। నమృతసంపాదనాయత్త చిత్తాబ్జులై నిబ్బరంబుగ బె
నుబొబ్బ లిడుచు। ద్రచ్చుచో బయిబడ్డ తరికొండ వీపునదాల్చి తద్గీ
ర్వాణదానవులను॥ కూర్మితో గాచినట్టి శ్రీకూర్మరూప। తనివిదీరగ
మనమున నినుభజింతు। నవఘనశ్యామ॥ ౬౨

సర్వంసహాచక్రి సర్వస్వనాశక దుర్వీర్యనిర్వక్రగర్వసహిత। దు
ర్వారగీర్వాణనిర్వాపణక్రియాఖర్వమహాభీషణౌర్వతులిత। చటుల
ప్రతాపభీషణహిరణ్యాక్షుని వక్షంబు కొమ్మున వగులనేసి। తదధీనమ
గు ధరాతలము పూర్వమువలె సమతలముగ జేసి సదయహృదయ॥
మమరసౌకర్యమూర్తివైనట్టి నిన్ను। దినదినంబున మనమున వినుతి
జేతు। నవఘనశ్యామ॥ ౬౩

భావింప శ్రీవాసుదేవాత్పరంనాస్తి యనుచు గానూదుల నణ
చి సకల। భాగవతోత్తమప్రఖ్యాతి నలరిన కొడుకును హింసింపగోరు
హేమ।కశిపుని భైరవాకారము గైకొని శతకోటి కోటిభాస్వన్నఖము
ల। నుదరము చీల్చి దుర్మదము తూలగజేసి కదసి తత్ప్రహ్లాదుగాచి సు
రలు॥ మునులు కైవారములుసేయ ముదముతోడ। దనరు నరహరి
నీకు వందన మొనర్తు। నవఘనశ్యామ॥ ౬౪

గుజ్జురూపము దాల్చి ముజ్జగంబులు చిన్నిబొజ్జలో కదులాడ
ప్రోడవగుచు। నదితికశ్యపులకు నమరగా జన్మించి పయనమై జనులు
విభ్రాంతినొంద। దడయక బలిని మూడడుగు లిమ్మనివేడి యఖిలబ్ర
హ్మాండంబు లాక్రమించి। కడగి తద్బలి నధోగతిపాలు గావించి దిశ

లందు నీకీర్తి తేటపరచి॥ జగతి వామనమూర్తినా దగు మహాను। భా
వుడవు జూడజూడగా నీవెకావె। నవఘనశ్యామ॥ ౬౫

కూ్రరులై ధారుణీభారకారణులైన భూనాయకులనెల్ల పోలు
పుమిగుల। హితవుగా జమదగ్నిసుతుడవై పోరిపోరి ముయ్యేడుమా
రులు మొనసితిరిగి। పరశుధారను దు్రంచి నిరుపమగతిమించి ధరణిక
శ్యపునకు దారబోసి। యంతరం బలర శమంతపంచకమును గావించి
విఖ్యాతిగాంచి మించి॥ పరశురామసమాఖ్యచే బరగి జగతి। బ్రిబలిన
మహాత్మ నిన్ను నే బ్రిస్తుతింతు। నవఘనశ్యామ॥ ౬౬॥

తలపోయగా జతుర్దశవత్సరంబులు వనమందు వేడ్కచే వసతి
జేసి। సరసిజాసనదత్తవరగర్వ దుర్మదగ్రస్త లోకైక విద్రావణ దశ।
కంఠ కంఠైక విలుంఠనాకుంఠితశాతమహాబాణజాల మమర। సకలదా
నవవినాశము జేసి సీతతో జేతోముదమున సాకేతకేగి॥ నట్టి దశరథగ
ర్భదుగ్ధాంబునిధిని। శాకరుడవగు నిన్ను నే సన్నుతింతు। నవ॥ ౬౭॥

కళగుల్కు నీలంబువలె దళతళలాడు డంబైన నీలాంబరంబు
మెరయ। నెల్లలోకములను పెల్లగింపగజాలు సీరంబు మూపున జెలు
వుజూప। మహితహాలాపాన మదవిజృంభిత బాహుబలసమగ్రస్ఫూర్తి
బరిఢవిల్ల। గమనీయ రోహిణీగర్భ మహాశుక్తి ముక్తాఫలంబన ము
రువుగాంచి॥ బకముఖామరవిద్విషత్ప్రతతి గూల్చి। నట్టి బలరామరూ
ప నిన్నాశ్రయింతు। నవఘనశ్యామ॥ ౬౮॥

కరమొప్పగా నిరీశ్వరవాదులగు బౌద్ధమతములెల్లపుడు దుర్మ
దములోడ। దొడరి యాస్తికులనుదూరి తన్మతమెల్ల గదసి యోచిం
పగా గల్లలనుచు। గడు గర్వమున నుండగా గని తద్బౌద్ధమతమును
మొదలంట హతమొనర్చి। సకలలోకంబులు సన్నుతిసేయగా దినకర
శతకోటి తేజమమర॥ బుద్ధరూపంబు గైకొని బౌద్ధగయను। దనరగా
నున్న శ్రీహరి నినుభజింతు। నవఘనశ్యామ॥ ౬౯॥

కలియుగమందు ముష్కరతురష్కవ్రాత కరుణావిహీన ని
ష్కారణాప। వాద దుర్ధాన వివాదానుమోద తస్కరసాధుజన భ

యంకరకుమార్గ। మున మెలంగెడు జనముల నందరిని కరకరవాలధారచే నరికి జగము। నిష్కంటకము జేసి నిఖిలభూభారము వారించి సకలవైభవము గాంచి॥ గొరలి శ్రీకల్కిమూర్తి నా బరగినట్టి। కంజలోచనుడవు నీ వెగడ దలంప। నవఘనశ్యామ॥ ౭౦॥

అమరలోకము శిరమాననం బిందప్రిపావకులక్షు లంభోజబాంధ వేందు। తెలమి దిశల్ శ్రోత్రములు గాలి ప్రాణంబు నాభ్యంతరిక్షము నలినభవుడు। శేఫంబు రోమముల్ చెట్లస్థితతి గిరుల్ వృష్టి వీర్యము నిజవృషణయుగము। మైత్రావరుణులును మహిపాదయుగముగా ఘనవిరాణ్మూర్తివై దనరుచున్న॥ నీమహత్వంబు నీయుక్తి నీమశక్తి। నీవిలాసంబు గొనియాడ నావశంబె। నవఘనశ్యామ॥ ౭౧॥

నెరి కుంభకారుడు నెమ్మనంబలరగ బలుతెరంగుల ఘటముల రచించు। క్రమమున సచరాచర జగంబు కల్పించి ఘటమూలమ్మృత్తికకరణి నిఖిల। కార్యకారణుడవై కదసి లోకములు చేపట్టి యౌదుంబరఫలవినిష్ఠ। జంతుజాలముమాడ్కి జగములు బొజ్జలో దొంతిగా నిడి బలువింతగాగ॥ దనరుచున్నట్టి నీమహత్వంబు తెలసి। సన్నుతింపంగ విధికైన శక్యమగునె। నవఘన॥ ౭౨॥

పదలంఘ్యమట వార్ధి భటులు వానరులట పరిపంథి రావణబ్రహ్మ యట జ। యింప బూనినది నిలింపరేని కసాధ్యమైన లంకాపురమట రథంబు। కల దనరాదట కపటభీషణులైన క్రవ్యభుక్సమితితో గలహమట న। రుడవు నీవట మారివడువున దనుజుల నెడలేక నేరీతి గెడపినావొ॥ చిత్రమయ్యెనుగద నీచరిత్ర మహహ। దీనమందార నీ జాడ దెలియవశమె। నవఘనశ్యామ॥ ౭౩॥

అవనిజ పరిణయంబైనపిమ్మట నల సాకేతపురికేగుచో గడంగి। దారి కడ్డము జొచ్చి మీరి శంకరధనుర్భంగంబు గావించి పదర నేల। నెలమి వైష్ణవధను వెక్కుబెట్టక నిన్ను కదలనీననుచు నిక్కముగబల్కు। పరశురామునివిల్లు భంగించి తత్సార మామూలముగ గొ

నునట్టివేళ॥ నిర్జరులు మేలుమేలన నిన్నుజూడ। పుండరీకాక్ష వేకన్ను లుండవలదె। నవఘనశ్యామ॥ ౭౪॥

కడగి కార్చిచ్చుకై వడి భవత్ప్రదరములడరి దానవులపై బడి కదువడి। యెడసేయకను మిత్తివడువున దునుంపగా దెగినకంఠంబు లొరగినతలలు। పగిలినవక్షము ల్పగిలిన పొట్టలు సగమైన మేనులు వగచు జీవు। లడిమురిగా వ్రాలి పొరలెడు శవములు గూలినరథము లు గుంజరములు॥ గాగ యుష్మత్కదనకళాకలితశక్తి। పెంపుదీపింప జూచి నుతింపవలదె। నవఘనశ్యామ॥ ౭౫॥

పరిపంథులగు నిశాచరుల గొందరబట్టి లీలమై కాలునిపాలి కనిచి। కడిమి రాకాసిమూకలను గొందరగిట్టి యబ్ధిలో జొరబడున ట్లుచేసి। కపటులైనట్టి రక్కసుల గొందరనట్టి బలిమిమై కానలపాలు పరచి। తరిమి దానవుల గొందరిని చిక్కులబెట్టి మునిముట్టు సురలోక మునకు బరిపి॥ యతులగతి నెప్పు త్వత్కరస్థితశితాసి। కలహసామర్థ్య మింతైన దలపవశమె। నవఘనశ్యామ॥ ౭౬॥

పాతకాలయదుష్టయాతుధానవ్రాతవాతాశనకదంబవైనతే య। ఘటకర్ణముఖదైత్యగళశుష్కవనసముదయమహాభీషణదావ దహన। సురభయంకరనిశాచరశిరోదరకరపాలేయదారుణపంక జాప్త। క్రవ్యభుక్సంజాతహవ్యవాహనపూర్ణవర్షాగమాంచితవారి వాహ। కుటిలదానవజీమూతపటలవాత। లో తెరిగి నిన్ను గొనియా డ నాతరంబె। నవఘనశ్యామ॥ ౭౭॥

ముద్దుగులుకెడు నగుమోము నవరసముల్గులికెడు తియ్యనివ లుకు లలరు। విలతునివిల్లు బొమలు నిగనిగలాడు చెక్కులు క్రొమ్మా విచివురు మోవి। తళుకులీనెడు వజ్రములబోల్పదగు పలుచాలు వీను లసిరిజాడ కలిమి। చెలువనెలవుకన్న జెలువైన కనుదోయి పసిడిదు ప్పటి వలెవాటు నీటు॥ దనరు భవదీయ దివ్యసందర్శనంబు। గలుగ జేయుము కన్నులకరువుదీర। నవఘనశ్యామ॥ ౭౮॥

బలిమి రాకాసిమూకలు పెక్కుగా జుట్టుముట్టియొక్కుమ్మడి దిట్టముగను। కడిమిమై తేనెటీగలు పెల్లురేగినకైవడి బలముల గదసి కరుకు। టమ్ముల జిమ్మి యొక్కుమ్మడి విలువిద్య మెరయగా బలముల బరిపి పక్వ।తాళఫలంబులు గాలిచేగూలినపోలికనందరి బొలియజేసి॥ ప్రకటగతితోడ బొల్చుతావకసుకీర్తి।జాల మెన్నంగ వేనోళ్లు జాలవన్న। నవఘనశ్యామ॥ ౨౯॥

మారీచఖరమహాక్రూరనక్తంచరఘోరవైశ్వానరవారివాహా। కపటనిశాటవర్గప్రాణవాతూలదారుణాంచితవనదావదహన। పంక్తికంఠానుజప్రముఖపాతకశీలయాతుధానభుజంగహారిశతాంగ। యకలంకమునివిహింసకపూర్వగీర్వాణలోకపృథ్వీధరపాకవైరి॥ ప్రచురబ్రహ్మాండమందు భవత్సమాన। మైనప్రత్యక్షదైవ మెందైనగలదె। నవఘనశ్యామ॥ ౩౦॥

హరి వాసుదేవ నారాయణ కేశవ గోవింద పరమాత్మ కుజనహరణ। శ్రీధర వామన మాధవాచ్యుత శౌరి పద్మనాభ ముకుంద పరమపురుష । కౌస్తుభవనమాలికావిరాజితవక్ష పతితపావన దేవ భక్తవరద। ఖగరాజగమన పంకజదళలోచన కువలయాధీశ వైకుంఠనిలయ॥ దశరథాత్మజ లోకేశ దైత్యహరణ। నిన్నువిడజాలమదిలోన నిముసమైన। నవఘనశ్యామ॥ ౩౧॥

తాపసమందార దైవచూడామణి శ్రీపతి జగదీశ చిన్మయాత్మ। నాపాలిదేవరా లోపము లెంచక కాపాడవలె నింతకపటమేల। రేపుమాపనబోకు మీపట్ల దయతోడ జేపట్టుమని వేరె చెప్పవలెనె। సాపరాధులనైన రాపుసేయని నిన్ను బ్రాపుగా నమ్మితి బరమపురుష॥ నీదయాదృష్టి నాపైని నిగుడజేసి। కరుణజూడుము జాగేల కనకచేల। నవఘనశ్యామ॥ ౩౨॥

శరణన్న పరునైన గరుణించుటే కాని జాడకైనను విడనాడబోవు। జనకవాక్యముసేయ బనిబూనుటే కాని మాటకైనను జవదా

టబోవు। శరణార్థులను దయాసరణి బ్రోచుటె కాని యాడినమాట మారాడబోవు। సాధుబాధకులను సంహరించుటె కాని వేడుకకై న గాపాడబోవు॥ భళిర ప్రత్యక్షమైన దైవములు జగతి। గడసి చూచిన నీకన్న గలరె వేరె॥ నవఘనశ్యామ॥ ౮౩॥

మొలకనవ్వుల ముద్దుగులుకుచుండెడుబలు చెలువైన నెమ్మోము గలుగునీదు। చరణనఖశ్రీల బరికించి యలనిశాకరనిశాచరుడు తస్కరమనీష। నమవస నడురేయి నల్లనల్లన జని చల్లగా దత్కళల్ కొల్లలాడి। మరునాడు మాని యమ్మరునాడు మొదలుగా నొక్కొక కళబూనె నక్కజముగ॥ నట్లుగాకున్న గళదప్పినట్టిశశికి। బున్నమందున సిరులంత పొసగుటేల। నవఘనశ్యామ॥ ౮౪॥

చెలులు చుట్టంబులు చెంతను రాబోరు తనయులు వెనువెంట దవిలిరారు। తోడబుట్టినవారు కూడిరాజాలరు మామలు రోగము ల్మాన్పలేరు। తల్లిదండ్రులు మృతి దప్పింపనేరరు ప్రాణబంధువులైన పనికిరారు। మనసిచ్చి బావలు మారుమాటాడరు ధనవాంఛ నితరులు తారువారు॥ గాన సంసార మసదని మానసమున। నింపుసాంపార నిన్నభావింపుచుందు। నవఘనశ్యామ॥ ౮౫॥

శరణు భాసురదివాకరకులాంబుధిచంద్ర శరణు భాస్కరకోటిసన్నిభతేజ। శరణు లోకైకరక్షణవిచక్షణదక్ష శరణు వితాసితసురవిపక్ష। శరణు సేవకసుధాశనతపోజనపక్ష శరణు దయామేయ సత్కటాక్ష। శరణు విక్రమజితశతశతహర్యక్ష శరణు కర్ణాయత సరసిజాక్ష॥ దీనమందార దాపేల దిక్కునాకు। నీవె గాకున్న నితరులు గావగలరె। నవఘనశ్యామ॥ ౮౬॥

నలుమొగంబులు గల్గు తొలివేల్పువై మున్ను పొలుపారగా జగంబులు రచించి। కమలాప్త హిమకరుల్ కనుదోయిగాగల సిరివిందువగుచు సంస్థితియొనర్చి। కనకంపుగొండ సింగాణిగాగల దొరవగుచు లోకములు లయంబొనర్చి। తజ్జగంబులపిందు బొజ్జలో నిరికించి

జలధిపై సుఖనిద్ర సలిపినట్టి॥ సత్యసంకల్ప తావకసరణి గాంచి।భూత
లంబున గొనియాడ నాతరంబె। నవఘనశ్యామ॥ ౮౭॥

పొలుపార నెవ్వాని బొడ్డుతామరయందు జతుగాననుడు ము
నుసంభవించె। నెడలేక నెవ్వానికడుపులోపలను క్రిక్కిరిసి లోకంబులే
కీభవించె। బుడమి నెవ్వానిమాయ భూతకోటులనెల్ల మొనసి కామా
దుల మునుగజేసె। ననుపమఖ్యాతి నెవ్వాని దయారసదృష్టి దీనమా
నవకామధేనువయ్యె॥ నట్టి రఘునాథ మనసు నాయందు నిలిపి । కా
మితములిచ్చి బ్రోవ నాకేమికొదువ। నవఘనశ్యామ॥ ౮౮॥

జలధి భూతలము భూతల మంబునిధిగాగ బచరించదగు వరి
పాటిదనరి।తృణముగా మేరువుతృణము మేరువు గాగ రచియించదగిన
విక్రమముగలిగి। జలము పావకునిగా జలముగా బావకు నొనరించుసా
మర్థ్యమునను బొదలి।మన్ను వజ్రంబుగా మన్నుగా వజ్రము నెనయిం
చునోర్బలమునను దనరి॥ యనఘ దుర్లలితాద్భుతవ్యసనశక్తి । గలిగి
రాజిల్లు నీపాదములు భజింతు। నవఘనశ్యామ॥ ౮౯॥

పరభయంకర ధనుర్ధరుడైన లక్ష్మణు డతినమ్రుడగుచు వె
న్నంటినడువ। మహితమైదనరు చర్మకృపాణపాణియై భరతుండు వల
పటబలసికొలువ। డాపలశత్రుఘ్ను డోపికమీరగా సమరసన్నద్ధుడై స
న్నుతింప। ధనురాదిదివ్యసాధనసమగ్రస్ఫూర్తి నలువొంద నీదర్శనం
బొసంగి॥ ప్రబలుచున్నట్టి మద్దురాపదలు దోలి। యభయమీయగద
య్య మాయయ్యకాన। నవఘనశ్యామ॥ ౯౦॥

క్రొత్తనెయ్యంబుని కొమరున నిను దినదినము తియ్యారించిన
ను ముదమున।నెయ్యంబు మీరగా సయ్యన నాదగు కుయ్యాలకించ
వు కొయ్యతనమ। లేక నాభాగ్యమా నీకటాక్షంబింత రాకుండ నన్య
కారణములేదు। నాదిక్కు నీప్రేమ రాదాయెనా మనసు లేదాయెనా
చాలువాదమేల॥ రవ్వకొడిగట్టినావే మొ నవ్వుగాదు । ఖండితంబుగ
ననుబ్రోవకుండవశమె। నవఘనశ్యామ॥ ౯౧॥

ముండిమై దండకమండలంబులు దాల్ప మేరమీరిన తృష్ణ
జేరకున్నె। జపమంచు నెపమిడి జరిపితె పూసలు కామలోభాదులు

గలుగకున్నె। మెడనిండ రుద్రాక్ష లెడలేకదాల్చితే పరకాంతపై బు
ద్ధి పారకున్నె। పొలుపుమీరగ నూర్ధ్వపుండ్రముల్ దీర్చితె మాడ
కైనను కల్లలాడకున్నె॥ బుధులుకొనియాడ దేహాత్మబుద్ధి నుడిగి। నీ
కు దాసానుదాసులై నెగడకున్న। నవఘనశ్యామ॥ ౯౨॥

శరణాగతాఖిలజనమనఃకామితసంధానపరిపూర్ణ సదయహృ
దయ। దరదరవింద సుందరతరచరణారవింద కందలినీల విశ్వతుం
ద। నందితాఖిలసురబృంద దివ్యమునీంద్ర సందోహసంతతానంద
రూప। వందారుసనకసనందనాంగణలసన్మందారపాదప మాన్యచరి
త॥ పతితపావనబిరుదాంక పరమపురుష। నన్నుదయజూడు జాగేల న
యవిశాల। నవఘనశ్యామ॥ ౯3॥

పరమార్థమెరిగి సద్భక్తితో నీపాదకమలము గొలిచిన విమల
మతులు। ప్రతిదినం బుడుగని వ్రతముగా నీనామమంత్రంబు చవిగొ
న్న మానధనులు। సకలలోకములు యుష్మన్మయంబని భూతముల
యందు సమబుద్ధిగల మజనులు। వసుధ నీకన్న దైవములు లేరని మది
బోలగా బరికించు పుణ్యాతములు॥ కామితార్థంబులంది విఖ్యాతిజెంది।
కడకు భవదీయసన్నిధి గాంతు రహహ। నవఘనశ్యామ॥ ౯౪॥

వామభాగమునందు వైదేహిముందర పవనసంభవుడును పశ్చిమ
మున। సౌమిత్రియుభయపార్శ్వములందు శత్రుఘ్నభరతులుజూడవా
య్వాదికోణ। ములయందు వరుసగేల్మోగిచి యంగద కీశపతి విభీష
ణ జాంబవంతు లెలమి। గొలువగా హరినీలములడాలు సొంపున దను
కాంతులలర మధ్యమున గొలువు॥ దీర్చి కూర్చున్న నీమూర్తి దివిరి నా
దు। హృదయమందున నివసించి పొదలుగాత। నవఘనశ్యామ॥ ౯౫॥

కోపమా నీదయలోపమా నే జేయుపాపమా మోమిటు
జూపవేల। మాటలా నాతోటి యాటలా వరహాల మూటలా వట్టి
యారాటమేల। పంతమా లేక సామంతమా యిది బలవంతమా నా
చోట రంతులేల। బెంపవా యఘములదుంపవా నన్ను బోషింపవా
యదుట దీపింపవేల॥ కాని కానిమ్ము పెట్టుకో మానసమున। వాదు
బూనక మాన నీపాదమాన। నవఘనశ్యామ॥ ౯౬॥

రాగదే కరుణ రానీగదే కాకున్న వేగదే లసదనురాగకలిత। భారమా నామీద నేరమా నిగమాంతసారమా దయజూడు దూరమ నక। వీడరా చలము నీవాడరా ప్రేమతోఁగూడరా నాతోడునీడవగు చు। నేలవా గావగజాలవా దాతలబోలవా ప్రోల్వ నాపాలివేల్పు॥ జాలమిక నేల నీలీల దాళజాల। మారసుకుమార నీకింత వేరుగలదె। నవఘనశ్యామ॥ ౯౭॥

శరణాగతత్రాణబిరుదు బూనితి వేని నన్ను గాపాడవా నలిననయన। వసుధ నాపద్బాంధవఖ్యాతి గల్గితే మరుమాటలాడవా సరసహృదయ। శ్రితపారిజాత విఖ్యాతుడవై మెలగితే కోర్కెలీడేర్చవా గుణనిదాన। ఘనముగా బతితపావనుడవై పరగితే పాపము ల్బాపవా పరమపురుష॥ పసపొసగ లేని కోమటి వెసబజారు। జారవిడుచుట కేరీతి గోరునహహా। నవఘనశ్యామ॥ ౯౮॥

గతినీవె యనుచు నామతి నెంచి పలుమారు బ్రతిమాలుకొన్నను పలుకరాదె। దిక్కు నీవని నమ్మి మ్రొక్కినందున కింత నిలచి నాపై ప్రేమ జిలుకరాదె। నాదైవమని నిన్ను నమ్మియున్నందుకు కోరిన కోర్కె చేకూర్చరాదె। యిలవేల్పువని నిన్ను తలపోసినందుకు త్రేవ తేపకు మోము జూపరాదె॥ కొడుకు దుడుకైన జనకుడు గోరిముద్దు। సేయ నరజేసి పెనునూత ద్రోయగలడె। నవఘనశ్యామ॥ ౯౯॥

స్నానసంధ్యాద్యనుష్ఠానాదిక్రియలకు సొంపుమీరగ నొకసున్న జుట్టి। మహిత ధర్మార్థకామముల కొక్కుమ్మడి శ్రీమీరగా దిరునామముంచి। యనుపమ దానధర్మాది తంత్రములకు హాయిగా నాస్తిపర్యాయ మొసగి। యతులిత వేదచోదిత కర్మసమితికి నింపుదళోత్తుత్త లాకేత్వమిచ్చి। యిమ్ముగా నీదునామమే నమ్మియుంటి। జేరదీతువా లేదా నీ చిత్త మింక। నవఘనశ్యామ॥ ౧౦౦॥

ధరణీసురునకు బల్ సిరులొసంగిననాటిమాట యీనాటికి మరచినావా। కలికి పాంచాలికి వలువలిచ్చిననాటిమాట యీనాటికి మరచినావా। యడరి కాకాసురునార్తి దీర్చిననాటిమాట యీనాటికి మరచినావా। శరణన్న నలవిభీషణుని బ్రోచిననాటిమాట యీనాటికి మ

రచినావా! కానిచో గాలవశమున గటికితనము! బూనితివా లేనిచో
నన్ను బ్రోవరావె! నవఘనశ్యామ॥ ౧౦౧॥

అపరాధిననుచు విన్నపమెంత జేసిన నాలకింపవి దేమి కాలవశ
మొ! చపలచిత్తుడ నన్ను గృపజూడుమని తెల్ప మోముజూపవి దేటినో
ముఫలమొ! నీవాడ నుతిసేయ నేరనంచువచింప కడకుద్రోచెద వెంత
గడుసుతనమొ! మనవి జేసిన మారుమాటాడ వెరతువు మనమునం దె
క్కుడి మంకుతనమొ॥ కాని నీవంటినెరదాత దీనజనుల! నేలవలెగాక
విడనాడబోల దహహా! నవఘనశ్యామ॥ ౧౦౨॥

నీటిపై గొండ లేనాటికైనను దేలియుండునా జేలుగుబిందువ
లెను! పనిబూని యెన్నడైనను వానరులు కొల్వుగొలుతురా మానవ
కోటివలెను! రాతి నేతరికైన రమణి జన్మించునా చెలువారగా బ్రహ్మ
సృష్టివలెను! వనధి యేవేళనైనను కట్టుబోలునా కదసిచూడగ దటా
కములవలెను॥ భువనసృష్టిస్థితిలయముల్ పూనిసేతు! వట్లుగావున నీ
చేతనామెగాక! నవఘనశ్యామ॥ ౧౦౩॥

తనివిదీరగ బాలుద్రావి పిమ్మటబట్టి యతివజీవము బాపినట్లు
గాదు! నరదంభమున నల్ల కురుసైన్యముల నెల్ల దురములోబోరిగొన్న
సరణిగాదు! తాతగారింటికై దయచేసి మేనమామనక కంసునిగూల్చి
నట్లుకాదు! కడగి ద్రోణున కడ్డపడలేక ధర్మజు నచ్చుగా బొంకించిన
ట్లుకాదు॥ వైరమేటికి నాతోటి వలదు వలదు! చాటిచెప్పెదవినుము
మోమోటముడిగి! నవఘనశ్యామ॥ ౧౦౪॥

ధన మున్నదని మదాంధత వహించితె సరా పెంపుతో నిన్నె
పూజింపవలెను! కుల మెక్కువని గర్వకలన జెందితెసరా పెంపుతో
నిన్నె పూజింపవలెను! విద్యాధికుడనని విఱ్ఱవీగితెసరా పెంపుతో ని
న్నె పూజింపవలెను! వేదాంతినని మాయవాదమాడితె సరా పెం
పుతోనిన్నె పూజింపవలెను॥ తోడరి నీసేవజేయని దుష్టచిత్తు లిందు
నందున సుఖములేకుందు రకట! నవఘనశ్యామ॥ ౧౦౫॥

ఒకపక్క యమభటప్రకరముల్ రివ్వున జేరి పల్కురు భీతిజే యుచుండ। నాత్మబంధువులు దుఃఖావేశమున జుట్టుజేరి యార్తరవం బు సేయుచుండ। బదపడి కఫవాతపైత్యము త్రైవగ్రమ్మి చిత్తవైకల్య ము సేయుచుండ। బహుభృత్యగణముల బరికించి విడలేక జిక్కియక్క న వెతజెందుచుండ॥ గదసి నీనామ మపు డనగలనొ లేనొ। నాటికిప్పు డె తలతు నీనామ మహహా। నవఘనశ్యామ॥ ౧౦౬॥

అవని నాకెళ్ళకులామృతాంబుధి సుధాకరుడనా దనరు జ్యోగ యమునీషి। మజ్జనకుండు నిర్మలయశఃపూరిత హరిదంత మన్నాత నరస మాంబ। భవదీయకారుణ్యపాత్రాంధ్రగీర్వాణ సరసకవితా వి చక్షణుండ। నప్పయ సత్కవీంద్రాభిధానుడ సుధీజనవిధేయుడ నిత్యస త్యారతుడ॥ దవిలి శతకంబు నీ కంకితముగ గూర్చి। తగ నొసగితి గొ నుము నాతప్పుసైచి॥ నవఘనశ్యామ॥ ౧౦౭॥

మంగళం బతిజవోత్తుంగసారోద్యద్విహంగ పుంగవతురం గ నీకు। మంగళం బుత్తుంగభంగ భంగాకతరంగిణీవరగర్వభంగ నీకు। మంగళం బవనిజామానసాంభోరుహ భృంగీకృతాంచితాపాంగ నీకు। మంగళం బఖిలకాలాంగీకృతానేకసంగవిరహితాంతరంగ నీకు॥ మంగ ళంబవితరాజసారంగ నీకు। మంగళం బిదె భక్తానుషంగ నీకు। నవఘన శ్యామ కుటిలదానవవిరామ। జానకీరామ రవికులసార్వభౌమ॥ ౧౦౮॥

శ్రీ రామచంద్రార్పణమస్తు

శ్రీ జానకీరామశతకము సంపూర్ణము.